యూనిట్ I

# 3. అమ్మ కోసం

-నన్నయ భట్టు

## చదవండి - ఆలోచించండి - చెప్పండి

ఆ.వె. తల్లి దండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి? వాడు గిట్టనేమి?
పుట్టలోన చెదలు పుట్టదా? గిట్టదా?
విశ్వదాభిరామ! వినురవేమ!

### ప్రశ్నలు

1. ఈ పద్యం ఎవరి గురించి చెప్పబడింది?
2. చెదలతో ఎవరిని పోల్చారు?
3. మన ప్రాచీన కథలలో తల్లిదండ్రులకు సేవచేసిన వారి గురించి మీకు తెలుసా?

### నేపథ్యం

కద్రువ, వినత కశ్యప ప్రజాపతి భార్యలు. పెద్దభార్య కద్రువకు కశ్యపుని వరం వల్ల వేయిమంది కుమారులు పుట్టారు. వారే కర్కోటకాది సర్పాలు. వినతకు అనూరుడు, గరుత్మంతుడు పుట్టారు. అనూరుడు, సూర్యుని రథసారథి. వినత ఒక పందెంలో ఓడిపోయి కద్రువకు దాసి అయింది. తల్లితోపాటు గరుత్మంతుడు కద్రువ కుమారులకు సేవలు చేస్తూ ఉండేవాడు. మహాశక్తిమంతుడైన గరుత్మంతుడు తమ దాస్యానికి కారణం తెలుసుకోవడానికి తల్లి దగ్గరకు వెళ్ళాడు.

ఈ పాఠం నన్నయ రాసిన శ్రీమదాంధ్ర మహాభారతంలోని ఆది పర్వం ద్వితీయాశ్వాసం లోనిది.


### విద్యార్థులకు సూచనలు


1. పాఠం చదవండి. పదపట్టిక చూసి పదాలకు అర్థాలు తెలుసుకోండి.
2. సందర్భానికి తగిన అర్థాలు గ్రహించి చిత్రాల ఆధారంగా పాఠం భావాన్ని గ్రహించండి.
3. అర్థంగాని విషయాల గురించి మొదట జట్టులో చర్చించండి. తర్వాత ఉపాధ్యాయుడితో చర్చించి అవగాహన పెంచుకోండి.

©SCERT not to be republished

*ఉ. ఆయతపక్షతుండహతి న క్కులశైలము లెల్ల నుగ్గుగాఁ
జేయు మహాబలంబును బ్రసిద్ధియునుం గల నాకు నీపనిం
బాయక వీఁపునం దవడుఁబాముల మోవను, వారికిం బనుల్
సేయను నేమి కారణము సెప్పుము దీనిఁ బయోరుహాననా! 1

వ. అని యడిగిన వినత తనకుం గద్రువతోడి పన్నిదంబున నైన దాసీత్వంబును, జెప్పి యిట్లనియె. 2






కం. నీ కతమున నా దాస్యము
ప్రాకటముగఁ బాయు ననిన పలు కెడలోనం
జేకొని, యూఱడి నిర్గత
శోకస్థితి నున్నదానఁ జూవె ఖగేంద్రా ! 3

వ. 'కొడుకులు సమర్థులైనం దల్లిదండ్రుల యిడుములు వాయుట యెందునుం గలయది, గావున నీయట్టి సత్పుత్త్రుం బడసియు దాసినై యుండుదాననే', యనిన విని వైనతేయుండు దద్దయు దుఃఖితుండై, యొక్కనాఁడు కాద్రవేయుల కిట్లనియె. 4

కం. మా యీ దాస్యము వాయు ను
పాయము సేయుండు, నన్నుఁ బనుపుం డిష్టం
బేయది దాని న తెత్తు న
జేయుఁడనై యమరవరులఁ జేకొనియైనన్. 5

వ. అనిన నయ్యురగులు కరుణించి గరుడుని కిట్లనిరి. 6

చ. ‘అమితపరాక్రమంబును, రయంబును, లావును గల్గు ఖేచరో
త్తముఁడవు నీవు; నీదయిన దాస్యముఁ వాపికొనంగ నీకుఁ జి
త్తము గలదేని, భూరిభుజదర్పము శక్తియు నేర్పడంగ మా
కమృతముఁ దెచ్చియి’ మ్మనిన నవ్విహగేంద్రుఁడు సంతసంబునన్ 7

వ. ‘అట్ల చేయుదు, నమృతంబు దెచ్చి మీ కిచ్చి, యేనునుం,
దల్లియు దాస్యంబువలన విముక్తుల మగువార’ మని నొడివి,
తద్వృత్తాంతం బంతయుం దల్లికిం జెప్పి ‘యమృతహరణార్థం బరిగెద
నని మ్రొక్కి, తల్లి దీవనలు గైకొని గమనోన్ముఖుండై...... 8


*మ. వితతోల్కాశనిపుంజ మొక్కొ యనఁగా విస్ఫీథి విక్షిప్త ప
క్షతి వాతాహతి దూలి, తూల శకలాకారంబు లై వారిద
ప్రతతుల్ సాల్పడి నల్గడం జెదరఁగాఁ బాఱెన్ మనోవేగుఁడై
పతగేంద్రుం డమృతాంతికంబునకుఁ దత్పాలుర్ భయం బందఁగన్. 9

వ. అంత, 10

*ఉ. ఘోరవికార సన్నిహిత కోపముఖంబులు, దీప్తవిద్యుదు
ల్కారుణ దారుణాక్షములునై, నిజదృష్టి విషాగ్ని నన్యులం
జేరఁగనీక యేర్చుచుఁ బ్రసిద్ధముగా నమృతంబు చుట్టు ర
క్షారతి నున్న యుగ్రభుజగంబుల రెంటిని గాంచి చెచ్చెరన్. 11

వ. అయ్యురగంబులం దనపక్షరజోవృష్టి నంధంబులం జేసి, వాని
శిరంబులు ద్రొక్కి, పరాక్రమం బెసంగ నమృతంబు గొని,
గరుడుండు గగనంబున కెగసి .... యురగుల యొద్దకు వచ్చి,
మరకతహరితం బైన కుశాస్తరణంబున నమృతకలశంబు
నిలిపి, యురగులకుం జూపి యిట్లనియె. 12

కం. అనిమిషనాథ సుగుప్త మ
యిన యమృతము దెచ్చి మీకు నిచ్చితి, నస్మ
జ్జననీదాస్యము వాసెను,
దినకరపవనాగ్నితుహినదీప్తుల కరిగాన్ 13



© SCERT not to be republished

## కవి పరిచయం

ఆదికవి, వాగనుశాసనుడని బిరుదులు పొందిన నన్నయ పదకొండో శతాబ్దికవి. రాజమహేంద్రవరం రాజధానిగా ఆంధ్రదేశాన్ని పరిపాలించిన తూర్పుచాళుక్యరాజు రాజరాజనరేంద్రుని ఆస్థానంలోనివాడు. వ్యాసుడు సంస్కృతంలో రచించిన మహాభారతాన్ని ఆంధ్రీకరించిన కవిత్రయంలో మొదటివాడు నన్నయ. ఆంధ్రశబ్దచింతామణి అనే వ్యాకరణ గ్రంథం రచించిన తరవాత భారతంలో ఆది, సభాపర్వాలను, అరణ్యపర్వం 4వ ఆశ్వాసంలో 142 పద్యాల వరకు ఆంధ్రీకరించాడు. చాముండికా విలాసము, ఇంద్ర విజయము నన్నయ ఇతర రచనలు.

అక్షరరమ్యత, ప్రసన్నకథా కలితార్థయుక్తి, నానారుచిరార్థ సూక్తినిధిత్వం నన్నయ కవిత్వంలోని ప్రధాన లక్షణాలు. అనువాద పద్ధతిలో, శైలిలో తరువాతి కవులకు మార్గదర్శకుడయ్యాడు నన్నయ.

### ప్రక్రియ – ఇతిహాస కవిత

ఇది ఇలా జరిగింది అని చెప్పేది ఇతిహాసం. ఇతిహాసంలో కథకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ కథలు గ్రంథస్థం కాకముందు వాగ్రూపంలో ఉండేవి. రామాయణం, మహాభారతం మన భారతీయ ఇతిహాసాలు.

© SCERT not to be republished

## పద్యాల భావాలు

1. పద్మంవంటి ముఖం గల తల్లీ! విశాలమైన నా రెక్కలతో, వాడి అయిన ముక్కుతో కులపర్వతాలన్నిటినీ పిండిగా చేయగల గొప్పబలం, కీర్తి గల నేను, నీచమైన పాములను ఎల్లకాలం వీపు మీద మోయడానికి, వాటికి సేవలు చేయడానికి గల కారణమేమిటో చెప్పు.
2. అని గరుడుడు అడగగా, వినత తన సవతి అయిన కద్రువతో పందెంలో తాను ఓడిపోయినందువల్ల కలిగిన దాసీతనాన్నీ గురించి కొడుకుతో స్పష్టంగా చెప్పి, ఇలా అన్నది :
3. "ఓ పక్షిశ్రేష్ఠుడా! నీ కారణంగా నా దాసీతనం పోతుం"దని అనూరుడు చెప్పిన మాటలను మనస్సులో ఉంచుకొని, సమాధానపడి దుఃఖం పోగొట్టుకొని ఉన్నాను.
4. "కొడుకులు శక్తిమంతులైతే తల్లిదండ్రుల కష్టాలు తొలగిపోవడం సహజమే. కాబట్టి నీవంటి యోగ్యుడైన కుమారుణ్ణి పొంది, నేను ఇంకా దాసీగానే ఉండాలా?" అనగా గరుడుడు కద్రువ పుత్రులైన పాములతో దుఃఖించి, ఒకనాడు ఇలా అన్నాడు :
5. "నా తల్లికి, నాకు దాస్యం పోవడానికి ఆలోచన చేయండి. దీని కోసం మీకు ఇష్టమైన దేదో ఆజ్ఞాపించండి. దేవతాశ్రేష్ఠులను లోబరచుకొనైనా దాన్ని సాధిస్తాను".
6. అని గరుడుడు అడగగా ఆ పాములు (కద్రువ కుమారులు)జాలిపడి గరుడునితో ఇలా చెప్పాయి :
7. "నీవు అంతులేని విక్రమాన్ని, వేగాన్ని, బలాన్ని కలిగిన పక్షిశ్రేష్ఠుడివి. నీకు దాస్యం పోగొట్టుకోవాలనే అభిప్రాయం ఉంటే భుజబలం, సామర్థ్యం తెలిసేలా మాకు అమృతాన్ని తెచ్చి ఇయ్యి". అప్పుడు గరుత్మంతుడు సంతోషంతో –

8. "అలాగే చేస్తాను. స్వర్గంనుంచి అమృతం తెచ్చి మీకు ఇచ్చి, నేనూ మా తల్లి వినతా దాస్యంనుంచి విముక్తి పొందుతాం" అని పలికి, ఆ విషయమంతా తల్లికి చెప్పి "అమృతం తేవటానికి వెళ్తున్నా"నని పలికి నమస్కరించి తల్లి ఆశీస్సులుపొంది, వెళ్లటానికి సిద్ధమై......

9. పక్షిరాజు మనోవేగంతో బయలుదేరాడు. అప్పుడతడు నిప్పుకణాలతో కూడిన తోకచుక్కలా ఉన్నాడు. ఆకాశంలో కదలుతూ ఉన్నప్పుడు అతని రెక్కల గాలివల్ల మేఘాలు దూదిపింజలై చెదిరిపోతున్నాయి. అమృతాన్ని రక్షిస్తున్నవారు భయపడేటట్లుగా గరుత్మంతుడు మనోవేగంతో అమృతమున్నచోటుకు వెళ్ళాడు.

10. అప్పుడు.

11. అమృతాన్ని రక్షిస్తున్న భయంకరమైన రెండు సర్పాలను గరుత్మంతుడు చూశాడు. అవి ఆ సమీపానికి ఎవరినీ రానీయడం లేదు. వాటి ముఖాలు కోపాన్ని వెలిగక్కుతున్నాయి. చూపులు విషమనే అగ్నిని చిమ్ముతున్నాయి.

12. గరుడుడు తన రెక్కల వల్ల రేగిన దుమ్ముతో వాటి కళ్లు కనబడకుండా చేశాడు. వాటి తలలను తొక్కి పట్టాడు. అమృతాన్ని తీసుకొని ఆకాశానికి ఎగిరాడు. కద్రువ కుమారుల దగ్గరకు వచ్చాడు. మరకతమణులలాగా పచ్చగా ఉన్న దర్భల పరుపుపై అమృతం ఉన్న పాత్రను పెట్టాడు. దాన్ని పాములకు చూపించి, ఇట్లా పలికాడు :

13. "దేవేంద్రుడి రక్షణలో ఉన్న అమృతాన్ని తెచ్చి మీకు ఇచ్చాను. దీనికి సూర్యుడు, గాలి, అగ్ని, చంద్రుడు సాక్షులు – దీనితో నా తల్లి దాస్యం తొలగి పోయింది" అన్నాడు.

© SCERT not to be republished

## ఇవి చేయండి

### I. వినడం – మాట్లాడటం

1. తల్లిదండ్రుల కష్ట సమయంలో పిల్లలు ఏం చేయాలి? ఎందుకు?
2. నేటికాలంలో తల్లిదండ్రులపట్ల పిల్లలవైఖరి ఎలా ఉంది? దీనికి కారణాలు ఏమిటి?
3. పాఠంలో ఏయే పద్యాలు మీకు నచ్చాయి? ఎందువల్ల?

### II. చదవడం, అవగాహన చేసుకోవడం

1. అమృతం తేవడానికి వెళుతున్న గరుత్మంతుని వర్ణించిన పద్యం ఏది? ఆ పద్యాన్ని, దాని భావాన్ని రాయండి.
2. 1, 9, 11 పద్యాలకు ప్రతిపదార్థాలు రాయండి. ప్రతి పదార్థం అంటే పద్యంలోని ప్రతి పదానికి అర్థం రాయడం. ప్రతిపదార్థం రాయడంలో అన్వయ క్రమం సాధించేందుకు పదాల వరుస మార్చి రాయడం, పదాల మధ్య సంబంధం కోసం అక్కడక్కడా ప్రత్యయాలు చేర్చడం జరుగుతుంది.

ఉదా ॥ చ. 'అమితపరాక్రమంబును, రయంబును, లావును గల్గు ఖేచరో
త్తముఁడవు నీవు; నీదయిన దాస్యముఁ బాపికొనంగ నీకుఁ జి
త్తము గలదేని, భూరిభుజదర్పము శక్తియు నేర్పడంగ మా
కమృతముఁ దెచ్చియి' మ్మనిన నవ్విహగేంద్రుఁడు సంతసంబునన్

## ప్రతిపదార్థం

| | | |
|---|---|---|
| నీవు | = | గరుత్మంతుడివైన నీవు |
| అమిత | = | అధికమైన |
| పరాక్రమంబును | = | శౌర్యమూ |
| రయంబును | = | వేగమూ, |
| లావును | = | బలమూ |
| కల్గు | = | కల్గిన |
| ఖేచర+ఉత్తముడవు | = | పక్షి శ్రేష్ఠుడివి; |
| నీది+అయిన | = | నీ (యొక్క) |
| దాస్యమున్ | = | బానిసత్వాన్ని |
| పాచికొనంగ | = | పోగొట్టుకునేందుకు |
| నీకు | = | నీకు |
| చిత్తము | = | ఇష్టము (కోరిక) |
| కలదు+ఏని | = | ఉన్నట్లైతే |
| మాకు | = | ఉరగులమైన మాకు |
| భూరి | = | గొప్పదైన |
| భుజ దర్పము | = | భుజబలమూ |
| శక్తియున్ | = | శక్తీ |
| ఏర్పడంగ | = | ప్రకటితమయ్యేటట్లు |
| అమృతము | = | అమృతాన్ని |
| తెచ్చి+ఇమ్ము | = | తెచ్చి ఇవ్వు |
| అనినన్ | = | అని పలుకగా, |
| ఆ+విహగేంద్రుడు | = | పక్షిశ్రేష్ఠుడైన ఆ గరుత్మంతుడు |
| సంతసంబునన్ | = | సంతోషంతో (ఇలా అన్నాడు......) |

3. పాఠంలోని కింది పద్య పాదాలకు సమానార్థక వాక్యాలు గుర్తించండి.

i. అనిమిషనాథ సుగుప్తమయిన యమృతము ( )

(అ) అనిమిషనాథునికి ఇష్టమైన అమృతం (ఆ) ఇంద్రుడు దాచి పెట్టిన అమృతం

(ఇ) ఇంద్రునికి అయిష్టమైన అమృతం (ఈ) ఇంద్రుని చేత బాగా కాపాడబడిన అమృతం

© SCERT not to be republished

ii. ఆయత పక్షతుండ ( )

(అ) ఆయన పక్షి శ్రేష్ఠుడు (ఆ) ఆయన పక్షపాతి

(ఇ) పెద్ద రెక్కలు, ముక్కు (ఈ) పెద్ద పక్షిని నేను

iii. నీయట్టి సత్పుత్త్రుం బడసియు దాసినై యుండుదాననే? ( )

(అ) నీవంటి ఉత్తమ కుమారుణ్ని పొంది కూడా దాసిగానే ఉండనా?

(ఆ) నీవంటి ఉత్తమ కుమారుణ్ని పొందాను కనుక ఇక దాసిగా ఉంటాను.

(ఇ) నీవంటి గొప్ప కుమారుణ్ని పొంది కూడా దాసిగానే ఉన్నాను.

(ఈ) నీవంటి గొప్ప కుమారుణ్ని పొందినా దాసిగానే ఉంటాను.

**4 ఈ కింది మాటలు ఎవరు ఎవరితో అన్నారో ఏ సందర్భంలో అన్నారో రాయండి.**

(అ) మా యీ దాస్యము వాయు నుపాయము సేయుండు

(ఆ) నీ కతమున నా దాస్యము ప్రాకటముగం బాయునని

(ఇ) నీదయిన దాస్యము వాపికొనంగ నీకు జిత్తము గలదేని

(ఈ) దినకరపవనాగ్ని తుహినదీప్తుల కరిగాన్

**5 కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.**

(అ) గరుడుడు తల్లిని ఏమని ప్రశ్నించాడు?

(ఆ) కద్రువ కుమారులను గరుడుడు ఏమడిగాడు? దానికి వాళ్ళేమన్నారు?

(ఇ) అమృతాన్ని ఎవరు, ఎలా రక్షిస్తున్నారు?

(ఈ) అమృతం తెచ్చిన గరుడుడు కద్రువ కుమారులతో ఏమని చెప్పాడు?

## III. స్వీయరచన

**1 కింది ప్రశ్నలకు ఐదు వాక్యాల్లో జవాబులు రాయండి.**

(అ) ఎంతో కష్టమైనప్పటికీ, దాస్యవిముక్తికోసం గరుడుడు అమృతం తెచ్చాడు కదా! అయితే దాస్యవిముక్తికి లేదా స్వేచ్ఛకు ఉన్న గొప్పతనం ఏమిటో వివరించండి.

(ఆ) వినత తన విముక్తికోసం కొడుకు మీద ఆశపెట్టుకుంది కదా! నేటికాలంలో తల్లిదండ్రులు తమ పిల్లల నుండి ఏమి ఆశిస్తున్నారు?

(ఇ) గరుడునిలో మీకు నచ్చిన విషయాలు రాసి, అవి ఎందుకు నచ్చాయో రాయండి.

(ఈ) మీరు మీ తల్లిదండ్రులకు ఏ విధంగా సహాయపడుతున్నారు? ఇంకా వాళ్ళకు ఏ విధంగా సహకారం అందించాలని అనుకుంటున్నారు?

(ఉ) యోగ్యులైన పిల్లలవల్ల తల్లిదండ్రులకు కలిగే ప్రయోజనాలు ఏమిటి?

© SCERT not to be republished

**2 కింది ప్రశ్నలకు పది వాక్యాల్లో జవాబులు రాయండి.**

(అ) "సమర్థులైన కొడుకులు తల్లిదండ్రుల కష్టాలు తొలగిస్తారు" – ఈ వాక్యాన్ని సమర్థిస్తూ సొంతమాటలతో వివరించండి.

(ఆ) ఈ పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి.

## IV. పదజాలం – వినియోగం

**1 కింది పేరా చదవండి. పేరాలో గీత గీసిన పదాలకు ఒక్కొక్క దానికి మూడు సమానార్థక పదాలు పేరా కింద ఉన్నాయి. వాటిలోనుంచి సరైన పదాలను ఎంపిక చేసి రాయండి.**

నభమున దట్టమైన వారిదములు విస్తరించాయి. ఉరుములు మెరుపులతోపాటు కులిశములు రాలాయి. దీనితో విపినంలో ఉండే వృక్షాలు కూలిపోయాయి. పన్నగాలన్నీ పుట్టలలోనికి దూరాయి. మబ్బులు వీడగానే పతంగుడు మళ్ళీ దర్శనమిచ్చాడు.

(ఆకాశం, పాము, పిడుగు, మేఘం, సూర్యుడు, అడవి, అరణ్యం, రవి, మబ్బు, అశని, ఫణి, గగనం, వనం, సర్పము, నిర్ఘాతము, అభ్రము, భానుడు, అంబరం.)

**2 కింది పదాలకు అర్థాలు రాయండి, సొంత వాక్యాల్లో ఉపయోగించండి.**

అమితం, పరాక్రమం, దాస్యం, సత్పుత్రుడు, ప్రసిద్ధి, విముక్తి

## V. సృజనాత్మకత

పాఠం ఆధారంగా గరుడునికీ, కద్రువ కుమారులకూ మధ్య జరిగిన చర్చను సంభాషణరూపంలో రాయండి.

## VI. ప్రశంస

పొరుగూరిలో మీకు మంచి స్నేహితుడున్నాడు. ఆ మిత్రుడు అనారోగ్యంతో ఉన్న తండ్రికి సేవలు చేస్తూ తల్లిదండ్రుల అభిమానం పొందాడని తెలుసుకున్నారు. అతణ్ణి ప్రశంసిస్తూ లేఖ రాయండి.

## VII. భాషను గురించి తెలుసుకుందాం

**1 కింది పదాలను విడదీసి సంధుల పేర్లను రాయండి.**

(అ) ఔరౌర = ________ + ________ (                )

(ఆ) దధ్యోదనము = ________ + ________ (                )

(ఇ) ప్రథమైక = ________ + ________ (                )

(ఈ) చిట్టచివర = ________ + ________ (                )

(ఉ) అత్యుగ్రము = ________ + ________ (                )



© SCERT not to be republished

**2 కింది పదాలను కలిపి సంధుల పేర్లను రాయండి. సంధి సూత్రాలు తెల్పండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| (అ) మొదట | + | మొదట | = | ________ | (          ) |
| (ఆ) దేవ | + | ఐశ్వర్యం | = | ________ | (          ) |
| (ఇ) దేశ | + | ఔన్నత్యం | = | ________ | (          ) |
| (ఈ) కడ | + | కడ | = | ________ | (          ) |
| (ఉ) అతి | + | ఉగ్ర | = | ________ | (          ) |

**3 ఆమ్రేడిత సంధి**

ఏడో తరగతిలో ఆమ్రేడితసంధిని గురించి కొంత నేర్చుకున్నాం గదా! ఆమ్రేడిత సంధికి సంబంధించిన మరో సూత్రాన్ని తెలుసుకుందాం.

ఔర + ఔర = ఔరౌర

ఆహా + ఆహా = ఆహాహా

అచ్చుకు ఆమ్రేడితం పరమైతే తరచుగా సంధి అవుతుంది. అయితే

1. పగలు + పగలు = పట్టపగలు
2. చివర + చివర = చిట్టచివర
3. కడ + కడ = కట్టకడ

పై పదాలు పరిశీలిస్తే ఇవీ ఆమ్రేడితమున్న రూపాలే. కాని పై సూత్రం ఇక్కడ వర్తించడం లేదు.

పగలు + పగలు = పట్టపగలు అవుతోంది అంటే 'ప' తర్వాత ఉన్న 'గలు' అన్న అక్షరాలకు బదులుగా 'ట్ట' వచ్చింది. 'ట్ట' వచ్చి పట్టపగలు అయింది.

చివర + చివర అన్నప్పుడు 'చి' తర్వాత రెండక్షరాల మీద 'ట్ట' వచ్చి చిట్టచివర అయింది.

కడ + కడ అన్నప్పుడు 'డ' స్థానంలో 'ట్ట' వచ్చి కట్టకడ అయింది.

**ఇప్పుడు కింది వాటిని కలిపి రాయండి.**

ఎదురు + ఎదురు = ____________

కొన + కొన = ____________

మొదట + మొదట = ____________

ఆమ్రేడితం పరంగా ఉంటే కడ మొదలైన శబ్దాలు మొదటి అచ్చు మీద అన్ని అక్షరాలకు 'ట్ట' వస్తుండడం గమనించాం కదా! అలానే మరిన్ని ఉదాహరణలను గమనించండి.

బయలు + బయలు = బట్టబయలు – మొదటి 'యలు' స్థానంలో 'ట్ట' వచ్చి, బట్టబయలు.

తుద + తుద – తుట్టతుద – మొదటి 'ద' స్థానంతో 'ట్ట' వచ్చి, తుట్టతుద.

© SCERT not to be republished

నడుమ + నడుమ - నట్టనడుమ - మొదటి 'డుమ' స్థానంలో 'ట్ట' వచ్చి, నట్టనడుమలుగా మారాయి.

పై ఉదాహరణల ఆధారంగా సూత్రం తయారు చేద్దాం.

**ఆమ్రేడితం పరంగాఉంటే కదాదుల తొలి అచ్చుమీది అన్ని అక్షరాలకు ద్విరుక్తటకారం వస్తుంది.**

**కింది పదాలను కలిపి రాయండి. ఏం మార్పు జరిగిందో రాయండి.**

**పిడుగు + పిడుగు** = ____________

**బయలు + బయలు** = ____________

**చదవండి - ఆనందించండి.**

## దేశభాషలందు తెలుగు లెస్స

జనని సంస్కృతంబు సకల భాషలకును
దేశభాషలందు తెలుగు లెస్స
జగతి తల్లికంటె సౌభాగ్యసంపద
మెచ్చు టాడుబిడ్డ మేలుగాదె?

- శ్రీనాథమహాకవి
('క్రీడాభిరామము'లోనిది)

తెలుఁ గదేల యన్న, దేశంబు దెలుఁ, గేను
దెలుఁగు వల్లభుండఁ, దెలుఁగొకండ,
యెల్ల నృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స.

- శ్రీకృష్ణదేవరాయలు
('ఆముక్తమాల్యద'లోనిది)

© SCERT not to be republished

**ప్రాజెక్టు పని**

"కష్టపెట్టబోకు కన్నతల్లి మనసు, నష్టపెట్టబోకు నాన్నపనులు" వంటి పద్యాలు "అమ్మను మించిన దైవం లేదు" వంటి సూక్తులు కొన్నింటిని సేకరించి తరగతిలో ప్రదర్శించండి.

**నేనివి చేయగలనా?**

| | | |
|---|---|---|
| 1. | తల్లి దండ్రులపట్ల పిల్లల వైఖరి ఎలా ఉండాలో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పద్యాలను భావయుక్తంగా చదవగలను. ప్రతిపదార్థం రాయగలను. | ఔను / కాదు |
| 2. | పాఠ్య సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | పాఠంలోని పాత్రలతో సంభాషణలు రాయగలను. | ఔను / కాదు |

తెలివైనవాళ్ళు మొదట చేసే పనిని తెలివితక్కువవాళ్ళు చివరిలో చేస్తారు.